క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

పది మంది జూదరుల అరెస్టు



అరెస్టయిన జూదరులతో పోలీసులు

సదుం: పది మంది జూదరులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ మారుతి గురువారం తెలిపారు. స్థానిక చింతపర్తివారిపల్లె సమీపంలోని వేప చెరువు వద్ద జూదం ఆడుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. తమను చూసి వారు పారిపోయేందుకు ప్రయత్నించిన పది మందిని అరెస్టు చేసినట్టు చెప్పారు. వారి నుంచి రూ.38,160 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థునుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌వో సుజాత, పీఈటీ సహీరా

రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రొంపిచెర్ల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికై నట్టు ఎస్‌వో సుజాత తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గతనెల 15న తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానంలో జరిగిన అండర్ 19 కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థినులు జి.వాసవి, ఎం.సుప్రియ ప్రతిభ చూపినట్టు తెలిపారు. వానే ఈ నెల 4, 5, 6 తేదీల్లో తూర్పు గోదావరిలో జగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీపోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ సహీరా పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

కుప్పం: కుప్పం నుంచి తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి వెళ్లే రోడ్డులో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆంధ్ర నుంచి తమిళనాడు వెళుతున్న లారీ నడుమూరు సరిహద్దు క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. లారిలో ఉన్నవారికి ఎలాంటి గాయాలు కాలేదు. అతివేగం వల్లే లారీ మలుపు వద్ద అదుపు తప్పినట్లు స్థానికులు అంటున్నారు. రోడ్డుకు అడ్డంగా లారి పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

అంటరానితనం అమానుషం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో మనోజ్‌రెడ్డి

బైరెడ్డిపల్లి: అంటరానితనం అమానుషమని ఆర్డీవో మనోజ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నెల్లిపట్లలో దళితుల పట్ల వివక్ష చూపుతున్నట్టు ప్రచారం జరగడంతో ఆర్డీవో మనోజ్‌రెడ్డి, తహసీల్దార్ కుమారస్వామి, ఎస్ఐ మోహన్‌కుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంతో మెలగాలన్నారు. దళితులను వివక్ష చూపుతున్నట్టు ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన దాతలు మురళీకృష్ణ, మహేశ్వరి రూ.5లక్షలు విరాళం అందించారు. ఉదయం దాతల కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డికి స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.5లక్షలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వద్దు



పలమనేరు: మాట్లాడుతున్న ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి



పుంగనూరు: మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

పలమనేరు: ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలు, అర్బన్ లెవల్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5, డిసెంబరు 2, 3 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. బీఎల్వోలు వారి బూత్‌లో విధుల్లో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫారం–7పై విచారణ చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

పుంగనూరు: ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులను పకడ్బందీగా చేపట్టాలని



పులిచెర్ల : బీఎల్‌వోలతో సమావేశమైన తహసీల్దార్

మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. ఆయన గురువారం తహసీల్దార్ సీతారామన్, ఎంపీడీవో నారాయణ, డీటీ హరికృష్ణతో కలిసి బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. వలస వెళ్లిన, మృతిచెందిన వారి పేర్లను తొలగించాలని సూచించారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించండి

పులిచెర్ల(కల్లూరు): ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దారు శేషగిరిరావు ఆదేశించారు. ఆయన గురువారం వీఆర్వోలు, బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో ప్రతి బీఎల్‌వో తమ పరిధిలోని ఓటరు జాబితాను పరిశీలించి డబుల్ ఎంట్రీలను తొలగించాలని, అర్హులను ఓటరుగా నమోదు చేయించాలన్నారు. మృతిచెందిన, వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. మండల స్పెషలాఫీసరు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: చౌడేపల్లి మండలంలోని విజయవాణి ఉన్నత పాఠశాలలో అక్టోబరు 27, 28వ తేదీల్లో జరిగిన పుంగనూరు జోనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దపంజాణి మండలానికి చెందిన శంకరాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం వేదవతి గురువారం తెలిపారు. 9వ తరగతి విద్యార్థి హరీష్ సీనియర్ బాలుర 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 10వ తరగతి విద్యార్థి రాజేష్ 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 400 మీటర్ల సీనియర్ బాలికల పరుగు పందెంలో కోమల ద్వితీయ స్థానం, 600 మీటర్ల జూనియర్ బాలుర పరుగు పందెంలో రాహుల్ ద్వితీయ స్థానం, 100, 200 మీటర్ల జూనియర్ బాలికల పరుగు పందెంలో అక్షయ తృతీయ స్థానం, 4x100 మీటర్ల రిలే సీనియర్ బాలుర పరుగు పందెంలో సుషాంత్, తరుణ్, సందీప్, హరిహర మొదటి స్థానం, 4x100 మీటర్ల జూనియర్ బాలుర రిలే పరుగు పందెంలో పవన్‌కుమార్, బాలాజీ, పార్థు, చందన్ మొదటి స్థానం, 4x100 మీటర్ల జూనియర్ బాలికల పరుగు పందెంలో బిందు, రూప, జాహ్నవి, అక్షయ ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం పేర్కొన్నారు. విద్యార్థులను పీడీ దొరై, ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు అభినందించారు.

పటిష్టంగా జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణ



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల (కల్లూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుచేద్దామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. వైద్య శిబిరాలకు వచ్చే వారిని పరీక్షించి వ్యాధులున్న వారిని పెద్దాసుపత్రులకు పంపించాలని సూచించారు. వైస్ ఎంపీపీలు రాశిప్రసాద్, ఈశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజశేఖర్, ఎంపీటీసీలు పోకల చంద్ర, రెడ్డిఅహమ్మద్, మంజుల, సర్పంచ్‌లు షుకూర్, రాణెమ్మ, నటరాజ, మధు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు చింతమాకులపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం



నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: ఎమ్మెల్యే వెంకటేగౌడ శనివారం చింతమాకులపల్లి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ యువరాజు తెలిపారు. ఆయన గురువారం చింతమాకులపల్లిలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతందన్నారు. కుదవగడ్డ, కోనేరుగొల్లపల్లి, చింతమాకులపల్లి, కాంచిమిట్టపల్లి, పసలమంద గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన



నడింపల్లిలో ప్రతిష్టించిన వాల్మీకి విగ్రహం

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ నడింపల్లిలో దాత కనుమకుంట సులోచన, సుకుమార్ బాబు(రిటైర్డ్ డీఎస్పీ, పుంగనూరు) అందజేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని గురువారం ప్రతిష్టించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటాన్ని నడింపల్లి, రాగిమాకులపల్లి, గౌడమాకులపల్లి, టీకేపల్లి, లింగమనాయునిపల్లి, సూరకుంట్ల, రాయలపేట, మారప్పల్లి, నడింపల్లిలో ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు.

వాలీబాల్ రాష్ట్ర పోటీలకు మర్రిమాకులపల్లె విద్యార్థినులు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన అనుశ్రీ, ఇందు

చౌడేపల్లె: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు చౌడేపల్లె మండలం మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థినులు అనుశ్రీ, ఇందు ఎంపికైనట్లు హెచ్ఎం నాదమునినాయుడు తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. వీరు ఈ నెల 9, 10, 11 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వారిని వ్యాయామ ఉపాధ్యాయుడు పవన్‌కుమార్, సర్పంచ్ షంషీర్, మాజీ ఎంపీటీసీ రమేష్‌బాబు అభినందించారు.

మేలు చేసిన వారికి అండగా నిలవండి



చీర, పసుపు కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ

శాంతిపురం: సీఎం జగనన్న, మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో తన భర్త భరత్ ప్రతి క్షణం కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాడని, మేలు చేసిన వారికి మీరు అండగా నిలవండి అని దుర్గ కోరారు. ఆమె గురువారం 'జగనన్నతో జనం–భరతన్నతో మనం' కార్యక్రమంలో భాగంగా మఠం పంచాయతీలోని రామనాథపురం, మఠం, శాంతంపల్లి, గంగతిమ్మనపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు దీపావళి పండుగకు చీరలు, గాజులు పసుపు కుంకుమ అందజేశారు. ఆమెకు మహిళలు హారతి పట్టి సాదర స్వాగతం పలికారు. జెడ్పీటీసీ శ్రీనివాసులు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు నాగమ్మ, పెద్దన్న, సుకుమార్, సర్పంచ్ మురళి, ఎంపీటీసీ చంద్రప్ప, మురుగేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి వైఎస్ఆర్ బీమా అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

శాంతిపురం: అబకలదొడ్డి పంచాయతీ కోతిగుట్లపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకుడు సుబ్రమణ్యం(48) కుటుంబానికి వైఎస్ఆర్ బీమా సొమ్ము మంజూరైంది. ఆయన అంత్యక్రియల కోసం గురువారం తక్షణ సాయంగా రూ.10 వేల బీమా సొమ్మును మృతుడి భార్య సరస్వతికి వైస్ ఎంపీపీ పట్టాభి అందజేశారు. మిగతా రూ.90 వేలను ప్రభుత్వం త్వరలోనే బాధితుల బ్యాంకు ఖాతాలో జమా చేస్తుందని చెప్పారు.

నేడు గంగవరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం

గంగవరం: ఎస్ఎల్‌బీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ ఇందులో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

11న విజయవాడలో మైనారిటీల దినోత్సవం



గ్రంథాలయంలో రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్

పుంగనూరు: విజయవాడలో ఈ నెల 11న మైనారిటీల దినోత్సవం నిర్వహించనున్నట్టు ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఉర్దూ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉర్దూ భాషను అభివృద్ధి చేసేందుకు మైనారిటీల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉర్దూ భాషను రెండో భాషగా ప్రభుత్వం గుర్తించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాధికారి నసీబ్‌జాన్, సలీమ్‌మాలిక్ పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్‌అదాలత్

పుంగనూరు: పుంగనూరు కోర్టు ఆవరణలో డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాజీకి అనువైన సివిల్, క్రిమినల్, మద్యం సేవించి వాహనాలు నడపడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బంది, తదితర కేసులను పరిష్కరిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

కలెక్టర్‌తో డిప్యూటీ కలెక్టర్ రేణుక



చిత్తూరు కలెక్టరేట్ : సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రేణుక గురువారం కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చిత్తూరు ఆర్డీఓగా పనిచేసి ఆమె ఇటీవల సివిల్ సప్లయ్స్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.

ప్రాజెక్టులను అడ్డుకున్న నీచుడు చంద్రబాబు



పరికరాలను పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ ఉమావాణి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
- రూ.50 లక్షల విలువైన పరికరాల పంపిణీ

చౌడేపల్లె: వ్యవసాయానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు తలపెట్టిన నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, ముదివేడు రిజర్వాయర్ల నిర్మాణ పనులను అడ్డుకున్న నీచుడు చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆరోపించారు. మండలంలోని గడ్డంవారిపల్లె సచివాలయం వద్ద గురువారం వాటర్ షెడ్ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 లక్షల విలువైన 13 రకాల యంత్ర పరికరాలు పంపిణీ శారు. ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గడ్డంవారిపల్లె, ఆమినిగుంట, పరికిదొన పంచాయతీల్లో వాటర్‌షెడ్ పథకం కింద పనులు మంజూరు చేయించారని తెలిపారు. మూడు పంచాయతీల్లో 205 మంది రైతులకు 306 యూనిట్ల పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏపీడీ ఉమావాణి, జెడ్పీటీసీ దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, సర్పంచ్‌లు భాగ్యవతి, లక్ష్మిదేవమ్మ, సావిత్రమ్మ, ఎంపీటీసీ శ్రీరాములు, మండల సచివాలయ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్.బాబు, వాటర్ షెడ్ చైర్మన్లు జయమ్మ, చలపతినాయుడు, ఎంపీడీవో సుధాకర్, పీవో ధనుంజయ వర్మ, జేఈ శ్రీనివాసులు, టీవో సుప్రజ రాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ బస్సుల కంపెనీ రాకతో దేశస్థాయిలో గుర్తింపు



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, నాగరాజారెడ్డి

పుంగనూరు: జర్మనీ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీని పుంగనూరులో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని, దీంతో పుంగనూరుకు దేశ స్థాయిలో గుర్తింపు లభించిందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాలు పుంగనూరు నియోజకవర్గం అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పుంగనూరు పారిశ్రామికంగా పరుగులు తీస్తోందన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పుంగనూరు మండలంలో రెండువేల ఎకరాలను ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేటాయించారన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి రూ.5 వేల కోట్లతో 800 ఎకరాల్లో జర్మన్ పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీకి ప్రభుత్వం అనుమతి వచ్చేలా చేశారని వివరించారు. బెంగళూరు, గుజరాత్, యూపీలో ఉన్న ఫ్యాక్టరీలు పుంగనూరుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని కొనియాడారు. బస్సుల కంపెనీలో 10 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుందని తెలిపారు. బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి మాట్లాడుతూ పుంగనూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి, మంత్రి కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు.

ముగిసిన కబడ్డీ జోనల్ క్రీడలు



బహుమతులు అందుకున్న సీనియర్ బాలురు, జూనియర్ బాలికల జట్లు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పుంగనూరు జోన్ గ్రిగ్ కబడ్డీ క్రీడలు గురువారం ముగిశాయని హెచ్ఎం నాగరాజురెడ్డి తెలిపారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్ద పంజాణి మండలాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా ఎంజేపీ సదుం జట్టు, రన్నర్స్‌గా పుదిపట్ల ఉన్నత పాఠశాల జట్టు నిలిచాయి. జూనియర్ బాలికల విభాగంలో విన్నర్స్‌గా పుదిపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, రన్నర్స్‌గా చౌడేపల్లె ఉన్నత పాఠశాల జట్లు నిలిచాయి. విజేతలకు హెచ్ఎం నాగరాజరెడ్డి, కబడ్డీ సంఘం కార్యదర్శి రామచంద్ర బహుమతులు అందజేశారు.

కుప్పం సీడీపీవోపై చర్యలు తీసుకోవాలి



పలమనేరు సీడీపీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పలమనేరు: అంగన్‌వాడీ వర్కర్లను వేధిస్తున్న కుప్పం సీడీపీవో అరుణశ్రీ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఇక్కడి సీడీపీవో ఇందిరాప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు గంగరాజు మాట్లాడుతూ వర్కర్లను నిష్కారణంగా విధుల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ సంఘం నాయకురాలు పద్మ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్



ఇద్దరు నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ సీఐ యల్లయ్య

గంగవరం: వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు పలమనేరు ఎస్ఈబీ సీఐ యల్లయ్య తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా వాణియంబాడికి చెందిన దక్షిణామూర్తి, తిరువణ్ణామలైకి చెందిన పొన్నుస్వామి వి.కోట– కుప్పం జాతీయ రహదారిలోని రాజుపేట క్రాస్ వద్ద కర్ణాటక వైన్ షాపులో మద్యం కేసులు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు వి.కోట మండలంలోని కస్తూరినగరం క్రాస్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20 వేల (180ఎంఎల్) 240 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. అదేవిధంగా బైరెడ్డిపల్లి మండలం జంగాల అగ్రహారం గ్రామానికి చెందిన అరవింద్ రెండు సంచుల్లో రూ.5 వేలు విలువ చేసే (90 ఎంఎల్) 100 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా చప్పిడిపల్లి క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ కేసులపై దృష్టి సారించాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌లతో, ప్రభుత్వ న్యాయవాదులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు ప్రభుత్వ న్యాయవాదులు చర్యలు చేపట్టాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల పట్ల దృష్టి వహించాలని తెలిపారు. పెండింగ్ కేసుల వివరాలు ప్రతి నెలా కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, సీనియర్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.